


## చీనీ టన్ను రూ.26,320

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26,320 పలికాయి.



## టమాట కిలో రూ.11

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.11 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

29.8°/19.2°

జిల్లా అంతటా బుధవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### సెమీస్‌కు మహారాష్ట్ర



విజేత మహారాష్ట్ర జట్టు

**అనంతపురం:** బీసీసీఐ, ఏసీఏ సంయుక్తంగా అనంత క్రీడాగ్రామం వేదికగా నిర్వహించిన అండర్–19 కూచ్ బెహర్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టుపై మహారాష్ట్ర జట్టు విజయకేతనం ఎగురవేసి సెమీస్‌కు అర్హత సాధించింది. మహారాష్ట్ర బ్యాటర్లు సుప్రాంత్ సావంత్ 295 బంతుల్లో 117 (19 ఫోర్లు), నిఖిల్ లునావత్ 229 బంతుల్లో 100 (16 ఫోర్లు) మంచి భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. తొలి ఇన్నింగ్స్‌లో 277 పరుగుల ఆధిక్యత సాధించిన సంగతి తెలిసిందే. రెండో ఇన్నింగ్స్‌లో ఓవర్‌నైట్ స్కోర్ మూడు వికెట్ల నష్టానికి 174 పరుగులతో ఆట మొదలు పెట్టిన మహారాష్ట్ర జట్టు ఆట ముగిసే సమయానికి మరో వికెట్ కోల్పోకుండా 305 పరుగుల భారీ స్కోరు చేసింది. ముగింపు కార్యక్రమానికి బీసీసీఐ సెలెక్టర్ హర్విందర్ సింగ్ సోదీ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో ఏసీఏ ఏజీఎం డి. శివ కుమార్, మ్యాచ్ రెఫరీ మిహిరా, ఏడీసీఏ కార్యదర్శి భీమలింగారెడ్డి, సౌత్ జోన్ అకాడమీ అడ్మినిస్ట్రేటీవ్ మేనేజర్ పీకే సాగర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

### రేపు గవిమఠం 7వ పీఠాధిపతుల పుణ్యారాధన

**ఉరవకొండ:** ప్రసిద్ధిగాంచిన ఉరవకొండ గవిమఠం 7వ పీఠాధిపతులు జగద్గురు కర్ళ కరిబసవ రాజేంద్ర మహాస్వాముల వారి 33వ పుణ్యారాధన కార్యక్రమం ఈ నెల 27న నిర్వహించనున్నారు. ఈ మేరకు మఠం మేనేజర్ రాణి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మఠం ప్రస్తుత పీఠాధిపతి జగద్గురు చెన్నబసవ రాజేంద్ర మహాస్వాముల నేతృత్వంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు భక్తులకు అన్నదానం ఉంటుంది.

### మహిళలకు కంప్యూటర్ శిక్షణ, ఉపాధి అవకాశాలు

**రాప్తాడు:** ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలోని ఎస్ఎల్‌సీ (సెల్ఫ్ లర్నింగ్ సెంటర్)లో నిరుద్యోగ మహిళలకు 45 రోజుల పాటు కంప్యూటర్ శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఎంటీఎల్ ఇంద్రజ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, బేసిక్ టాలీ, ఎంఎస్ ఆఫీస్, తెలుగు, ఇంగ్లిష్ టైపింగ్, లైఫ్ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. ఏదైనా డిగ్రీ, బీటెక్ పూర్తి చేసి, 20 నుంచి 35 ఏళ్ల వయసున్న మహిళలు అర్హులు. ఆసక్తి ఉన్న వారు రూ.2 వేలు రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 73969 50345, 91001 02811లో సంప్రదించవచ్చు.





గుత్తిలోని బైబిల్‌మిషన్ చర్చిలో ప్రార్థనలకు పెద్దసంఖ్యలో హాజరైన క్రైస్తవులు



అనంతపురంలోని అరవిందనగర్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు



అనంతపురం చర్చిలో సందేశమిస్తున్న పాస్టర్ ఐజయ్య, ఆకట్టుకుంటున్న ఏసయ్య జన్మ వృత్తాంత దృశ్యం

## ఏసు క్రీస్తు ఆగమనం.. ప్రేమ సాగరం

శాంతి, ప్రేమ, కరుణతో మానవాళికి శుభసందేశమందించిన కరుణామయుడు ఏసు ప్రభువు జన్మదిన వేడుకలు బుధవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ప్రార్థనల కోసం తరలివచ్చిన క్రైస్తవులతో చర్చిలు కిటకిటలాడాయి. పలు చర్చిల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీలు, పశువుల పాక దృశ్యాలు ఆకట్టుకున్నాయి. ప్రార్థనల సందర్భంగా చర్చిల్లో ప్లాస్టర్లు దైవ సందేశమిచ్చారు. సేవా కార్యక్రమాలతో స్ఫూర్తి చాటారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ప్రార్థన చేస్తున్న యువతి

‘అడిగినంత కొట్టు.. నీ వైపు చూస్తే ఒట్టు’ అన్నట్లుగా ఉంది ఆ ఎక్సైజ్ సీఐ తీరు. మద్యం అక్రమ అమ్మకాలను అరికట్టాల్సిన ఆయన.. ఆ విషయంతో తనకు సంబంధమే లేదన్నట్లుగా ‘మామూలు’గా వెళ్లిపోతున్నారు. ఉన్నతాధికారులకు కూడా ఇవ్వాల్సి ఉందంటూ భారీగా ‘రేటు’ ఫిక్స్ చేశారు. నా రూటే సెప‘రేటు’ అన్నట్లుగావ్యవహరిస్తున్న ఆయన తీరుతో బార్‌ల యాజమాన్యాలు ఘొల్లుమంటున్నాయి.



# ఇదేం కిక్కు నారాయణా!

- ఓ ఎక్సైజ్ సీఐ సెప‘రేటు’
- ఒక్కో బార్ నుంచి నెలకు రూ.50 వేలు, వైన్‌షాపు నుంచి రూ.20 వేలు మామూళ్లివ్వాలని హుకుం
- లిక్కర్ డిపో వద్ద వేరేగా మాట్లాడుకోవాలని సూచన
- అడిగినంత ఇస్తే పర్మిట్ రూములకూ అనుమతి
- ఏసీ, డీసీ భాగస్వాములని చెబుతున్న వైనం

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** వైన్‌షాపులు, బార్‌ల యాజమాన్యాలు నెలనెలా ఎంత చెల్లించుకోవాలో ఓ ఎక్సైజ్ సీఐ ఫిక్స్ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇక నుంచి ఒక్కో బార్ నుంచి నెలకు రూ.50 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. వైన్ షాపునకు రూ.20 వేలు ఇవ్వాలని చెప్పారు. దీంతో బార్‌ల యజమానులు తలలు పట్టుకుంటున్నారు. అడిగినంత ఇవ్వకపోతే బార్‌లను సదరు సీఐ నడుపుకోలేరంటూ వార్నింగ్ ఇచ్చారని వాపోతున్నారు. వసూలు చేసిన సొమ్ములో అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ), డిప్యూటీ కమిషనర్ (డీసీ)లకు వాటా కూడా ఇవ్వాల్సి ఉంటుందని సదరు సీఐ చెప్పినట్లు పలువురు బార్‌ల యజమానులు తెలిపారు. ఇక.. లిక్కర్ డిపో వద్ద ప్రత్యేకంగా మాట్లాడుకోవాలని, అది తమ పరిధిలోకి రాదని ఆయన చెప్పారని ఓ వైన్‌షాపు యజమాని తెలిపారు. అక్కడ డిపో మేనేజర్‌గా బి.వెంకట నాయుడు ఉంటారని, ఆయనతో మాట్లాడుకోవాలని చెప్పినట్లు తెలిసింది.

**చూసీ చూడనట్టు..**

బెల్టుషాపులు నిర్వహిస్తే ‘బెల్టు’ తీస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు డాంబికాలు పలుకుతున్నారు. కానీ జిల్లాలో చూస్తే వైన్‌షాపులు బార్‌లను తలపిస్తున్నాయి. ఎక్సైజ్ అధికారుల వసూళ్ల కారణంగానే విచ్చలవిడిగా పర్మిట్‌రూములు ఏర్పాటయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ‘మామూళ్ల మత్తు’లో అడిగే వారే కరువయ్యారు. అనంతపురంలోని రామ్‌నగర్ ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న ‘రుద్ర వైన్స్’ పక్కన అనధికార బార్ నడుస్తోంది. ఉదయం 10 గంటల నుంచే బహిరంగంగా ఇక్కడ మద్యం తాగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదొక్కటే కాదు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా వైన్‌షాపుల వద్ద ఇదే పరిస్థితి. అధికారులకు అడిగినంత ఇచ్చుకుంటూ వైన్ షాపుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో కోట్లాది రూపాయలు లైసెన్సు ఫీజు కింద చెల్లించిన తాము తీవ్రంగా నష్టపోతున్నామని బార్‌ల యాజమాన్యాలు వాపోతున్నాయి. పర్మిట్ రూములు నిలిపివేయాలంటూ ఇప్పటికే ఎస్పీని కలిసి వినతిపత్రం ఇచ్చినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

**మద్యం ఏరులు..**

మరోవైపు జిల్లాలో బెల్టుషాపులు యథేచ్ఛగా ఏర్పాటు చేస్తుండటంతో మద్యం ఏరులై పారుతోంది. నియంత్రించే నాథులే కరువయ్యారు. గతంలో ‘సెబ్’ పేరుతో బహిరంగ మద్యపానం, అక్రమమద్యంపై ఎక్కడికక్కడ కఠినంగా వ్యవహరించేవారు. ఇప్పుడు ‘సెబ్’ లేకపోగా, ఎక్సైజ్ విభాగం చేష్టలుడిగి చూస్తోంది. స్వయానా ఎమ్మెల్యేలే తమ షాపుల పక్కన పర్మిట్ రూములు ఏర్పాటు చేసుకుని అర్ధ రాత్రి వరకూ మద్యం తాగిస్తున్నారు. పట్టపగలే ఇలా జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులుగానీ, సివిల్ పోలీసులు గానీ కిమ్మనడం లేదు.

| | |
|---|---|
| అనంతపురం జిల్లాలో మద్యం షాపులు | 136 |
| శ్రీ సత్యసాయి జిల్లాలో మద్యం షాపులు | 69 |
| అనంతపురంలో బార్‌లు | 19 |
| శ్రీ సత్యసాయి జిల్లాలో బార్‌లు | 11 |

రూ.15 వేల లెక్కన ఒక్కో వైన్ షాపు నుంచి నెలకు వసూలు చేస్తున్నది

రూ.30,75,000

ఒక్కో బార్‌కు నెలకు రూ.40 వేలతో

రూ.12,00,000

### సీపీఎం జిల్లా కార్యదర్శిగా నల్లప్ప



సీపీఎం జిల్లా నూతన కమిటీ సభ్యులు

**అనంతపురం అర్బన్:** సీపీఎం జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహించిన జిల్లా మహాసభలో 26 మంది సభ్యులతో కమిటీని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా ఓ.నల్లప్ప, కార్యదర్శి వర్గ సభ్యులుగా వి.రాంభూపాల్, ఎస్.నాగేంద్రకుమార్, ఎం.బాలరంగయ్య, వి.సావిత్రి, బి.శ్రీనివాసులు, వి.రామిరెడ్డి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా ఆర్‌వీనాయుడు, నాగమణి, రామాంజినేయులు, తరిమెల నాగరాజు, వెంకటనారాయణ, నిర్మల, అచ్యుత్ ప్రసాద్, మల్లికార్జున, భాస్కర్, జగన్‌మోహన్ రెడ్డి, మారుతీప్రసాద్, ముత్తూజా, పరమేష్, నాగరాజు, రమేష్‌తో పాటు ఇద్దరు అంతర్గత సభ్యులను ఎన్నుకున్నారు.

**సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు**

మహాసభల్లో తీసుకున్న తీర్మానాలపై బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో విలేకరులతో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్‌తో కలిసి జిల్లా నూతన కార్యదర్శి నల్లప్ప మాట్లాడారు. జిల్లా అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తామన్నారు. హెచ్ఎల్‌సీ ఆధునీకరణ, హంద్రీ–నీవా కాలువ వెడల్పు, పంటకాలువ నిర్మాణం, ఉద్యాన పంటల ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, వృత్తుల పరిరక్షణ, వృత్తిదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనకు ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రతి ఏటా రూ.5 వేల కోట్ల కేటాయింపునకు సీపీఎం స్వతంత్రంగా ఆందోళనలు చేయడంతో పాటు కలిసి వచ్చే శక్తులతో ఐక్య ఉద్యమాలు నిర్మిస్తుందని చెప్పారు.

# విద్యుత్ చార్జీల పెంపుపై ఉద్యమం

- ప్రజలపై కూటమి ప్రభుత్వం రూ.15 వేల కోట్ల భారం
- చార్జీలు పెంచబోనంటూ ఇచ్చిన మాట తప్పిన సీఎం చంద్రబాబు
- వైఎస్సార్ సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త ప్రకాష్‌రెడ్డి ధ్వజం
- ‘వైఎస్సార్ సీపీ పోరుబాట’ను విజయవంతం చేయాలని పిలుపు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తదితరులు

**అనంతపురం కార్పొరేషన్:** విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక భారీగా పెంచి నవంబర్‌లో రూ.6 వేల కోట్లు,డిసెంబర్‌లో రూ.9 వేల కోట్ల భారం ప్రజలపై మోపారని వైఎస్సార్ సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ నెల 27న పిలుపునిచ్చిన ‘పోరుబాట’ను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యుత్ చార్జీలను పెంచారంటూ ప్రజలను టీడీపీ నేతలు మభ్య పెట్టారన్నారు. వాస్తవంగా ప్రజలపై భారం పడకుండా జగనన్న చర్యలు తీసుకున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో విద్యుత్‌ను వ్యాపారం చేసిన బాబు.. లాభాపేక్షతో యూనిట్ విద్యుత్‌ను రూ.5.90కు కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎంగా వైఎస్ జగన్ ఉన్న సమయంలో సెకీ ద్వారా యూనిట్‌ను రూ.2.49కే కొనుగోలు చేసి రూ.87,500 కోట్ల భారం ప్రజలపై పడకుండా చూశారన్నారు. ఇంటర్‌స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీల మినహాయింపు ద్వారా యూనిట్‌కు మరో రూ.2 రాయితీ ఇవ్వడం ద్వారా రూ.లక్ష కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. దేశానికే ఆదర్శంగా అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారని, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జగనన్న చర్యలు తీసుకుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా చంద్రబాబు కుట్ర పూరితమైన రాజకీయాలు చేశారన్నారు. 2014–19 టీడీపీ ప్రభుత్వంలో ఎంత ఎక్కువ ధరకు వీలైతే అంత ధరకు రాష్ట్ర ఖజానా నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేసి ప్రజలకు అన్యాయం చేశారన్నారు. విద్యుత్‌ను వ్యాపారంగా చేస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ఈ నెల 27న పోరుబాట చేపట్టి రాప్తాడు నియోజకవర్గంలోని ఏఈ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలిపారు.

**రూ.80 వేల కోట్లు ఏం చేశారు బాబూ?**

కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ప్రతి నెలా దాదాపు రూ.13 వేల కోట్ల చొప్పున గడిచిన ఆరు నెలల్లో రూ.80 వేల కోట్ల అప్పు చేశారని, ఆ డబ్బును ఎక్కడ ఖర్చు చేశారో సీఎం చంద్రబాబు చెప్పాలని ప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలకు పంగనామాలు పెట్టారన్నారు. జగనన్న అమలు చేసిన ‘అమ్మఒడి’, ‘వైఎస్సార్ చేయూత’, ‘రైతు భరోసా’, ‘వైఎస్సార్ ఆసరా’, చేదోడు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా తదితర పథకాలు ఇప్పుడు లేకుండా పోయాయన్నారు. ‘తల్లికి వందనం’ పేరుతో దగా చేశారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న 43 లక్షల మంది తల్లులకు రూ.15,000 చొప్పున ఏటా రూ.6,500 కోట్లు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు తాగేందుకు చుక్క, ఆడేందుకు మట్కా, పేక ముక్క, వేసుకునేందుకు గుట్కా ఉండాలన్నదే చంద్రబాబు చిట్కా అని ఎద్దేవా చేశారు. కూటమి సర్కార్ చర్యలను ఎండగట్టే సమయం ఆసన్నమైందని, పార్టీ అధిష్టానం పిలుపు మేరకు పోరాటానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో రామగిరి ఎంపీపీ నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు జూటూరు శేఖర్, అమర్‌నాథ్ రెడ్డి, రామాంజినేయులు, నీరుగంటి నారాయణ రెడ్డి, ఈశ్వరయ్య, నరసింహారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వీరాంజనేయులు, ఈశ్వరయ్య, పార్టీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ‘కాంట్రాక్టు’ దొంగ!

- పట్టపగలే ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి యత్నం
- రైతు రావడంతో పరారైన వైనం







పొలంలో బొలెరో వాహనం, జేసీబీతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగిస్తున్న దృశ్యం బాధిత రైతు

**కళ్యాణదుర్గం రూరల్:** పట్టపగలే వ్యవసాయ పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగిలించాలని చూశాడో ఘనుడు. అతను విద్యుత్ కాంట్రాక్టర్ అని బాధిత రైతు తెలపడం సర్వత్రా చర్చనీయాంశమైంది. బాధితుడి వివరాల మేరకు... కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దొడఘట్ట గ్రామ సమీపంలో నల్లబొతుల వెంటు వ్యవసాయ పొలం ఉంది. గతంలో పొలం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం కొంతమంది వెంటు పొలంలోకి చొరబడ్డారు. బొలెరో వాహనం, జేసీబీ కూడా తీసుకొచ్చారు. జేసీబీతో ట్రాన్స్‌ఫార్మర్ తొలగించేందుకు యత్నిస్తుండగా వెంటు అక్కడికి వచ్చాడు. ఈ క్రమంలో విద్యుత్ కాంట్రాక్టర్ సాబ్జాన్ అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితుడు 100కు డయల్ చేయగా పోలీసులు అక్కడికి చేరుకుని కూలీలను విచారించారు. ట్రాన్స్‌ఫార్మర్ తీసుకెళ్లేందుకు తమను కాంట్రాక్టర్ సాబ్జాన్ తీసుకొచ్చినట్లు వారు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు జేసీబీని, బొలెరో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు.. ఆ తర్వాత కొంతసేపటికే వదిలేయడం సర్వత్రా విమర్శలకు తావిచ్చింది. కాంట్రాక్టర్ సాబ్జాన్‌పై ఎలాంటి చర్యలు తీసుకోరాదంటూ టీడీపీ ముఖ్య నేతలు పోలీసులపై ఒత్తిడి చేసినట్లు తెలిసింది. పోలీసుల తీరుపై బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు. కాగా, ఈ ఘటనపై పట్టణ సీఐ యువరాజ్ వివరణ కోరగా డయల్ 100 ద్వారా అందిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపడతామని తెలిపారు.

### టీచర్లకు జేఎల్ ప్రమోషన్లు కల్పించాలి

**అనంతపురం ఎడ్యుకేషన్:** జూనియర్ లెక్చరర్లుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం అనంతపురం వేదికగా ఆపస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎర్రిస్వామి అధ్యక్షతన జిల్లా కార్యనిర్వాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. గతంలో విడుదల చేసిన జీఓ 302 ప్రకారం ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల టీచర్లకు ఇంటర్ తరగతులు బోధించేలా జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు ఇచ్చేవారని గుర్తు చేశారు. జీఓ 223 తీసుకొచ్చి జూనియర్ లెక్చరర్లకు ప్రమోషన్లు లేకుండా చేశారన్నారు. 10 శాతం నాన్ టీచింగ్ సిబ్బందికి జేఎల్‌లుగా ప్రమోషన్లు ఇస్తున్నారన్నారు. బీఈడీ అర్హత లేని కాంట్రాక్ట్ టీచర్లకూ అవకాశం కల్పిస్తున్నారన్నారు. అత్యంత అనుభవం కల్గిన ఉపాధ్యాయులకు ఎందుకు అవకాశం ఇవ్వరని ప్రశ్నించారు. వెంటనే 40 శాతం టీచర్లకు జేఎల్‌లుగా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఎర్రిస్వామి మాట్లాడుతూ... ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. హైస్కూల్ ప్లస్‌ను కొనసాగించి రెగ్యులర్ ప్రాతిపదికన ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కూళ్లలో ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. ఆంగ్ల మీడియంతో పాటు తెలుగు మీడియంనూ సమాంతరంగా కొనసాగించాలన్నారు. సమావేశంలో ఆపస్ జిల్లా ఉపాధ్యక్షుడు హర్షవర్ధన్, కార్యదర్శి రమేష్, నాయకులు వెంకటేష్, పోతులయ్య పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఉచిత శిక్షణ, ఉపాధి

అనంతపురం అగ్రికల్చర్: స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి వివిధ కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు వంద శాతం ఉపాధి కల్పన అవకాశాలను కల్పించనున్నారు. ఈ మేరకు కృష్ణా జిల్లా నందిగామలో ఉన్న కీట్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆసక్తి, అర్హత ఉన్న వారికి ఈ నెల 27 నుంచి నందిగామలో శిక్షణ ప్రారంభమవుతుంది. డేటా ఎనాలసీస్‌కు సంబంధించి అన్ని రకాల ఆధునిక కోర్సులపై మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తారు. ఉచిత భోజన, వసతి కల్పిస్తారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు, ఉపాధి అవకాశాలు దక్కేలా చర్యలు తీసుకుంటారు. పూర్తి వివరాలకు హరిప్రసాద్ (90004 87423), శ్రీనివాస్ (98498 88266)ను సంప్రదించవచ్చు.

### విద్యుదాఘాతంతో యువకుడి మృతి


అభిలాష్ (ఫైల్)

గుమ్మఘట్ట: విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం జె.వెంకటాంపల్లికి చెందిన శివన్న, కవిత దంపతులకు నలుగురు కుమారులున్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్న వీరు కొన్ని నెలలుగా సొంతంగా గృహ నిర్మాణం చేపట్టారు. బుధవారం ఉదయం కుమారుడు అభిలాష్ (19) విద్యుత్ మోటారు సాయంతో ఇంటి గోడలను క్యూరింగ్ చేస్తుండగా షార్ట్ సర్క్యూట్ కారణంగా షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి ఆటోలో తరలిస్తుండగా మార్గ మధ్యంలో ఆటో బోల్తాపడింది. ఘటనలో శివన్న, మంజునాథ, హనుమంతు, నింగమ్మ, రంజిత్ గాయపడ్డారు. క్షతగాత్రులు వెంటనే ఆటోను పైకి లేపి అందులోనే రాయదుర్గంలోని ఆస్పత్రికి చేరుకున్నారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అభిలాష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. క్షతగాత్రులకు చికిత్స అందజేశారు. పరిస్థితి విషమంగా ఉన్న శివన్నను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### శతాధిక వృద్ధురాలి మృతి


హుసేనమ్మ(ఫైల్)

రొద్దం: స్థానిక ప్రాథమిక పాఠశాల విశ్రాంత అటెండర్ హుసేనమ్మ(109) బుధవారం మృతి చెందారు. వయస్సు మీద పడినా తన పని తాను చేసుకుంటూ దృష్టి, వినికిడి లోపం లేకుండా అందరినీ పలకరిస్తూ ఉండే వారని ఆమె కుమారుడు రైల్వే బాబు తెలిపారు. అయితే రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురై ఆమె బుధవారం మృతి చెందినట్లు ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ఆమె 109 ఏళ్లు పూర్తి చేసుకున్నట్లు వివరించారు. విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు హుసేనమ్మ ఇంటికి వెళ్లి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు.

- సోలార్ ఎనర్జీలో ఆదర్శంగా నిలుస్తోన్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్
- 'గోగ్రీన్' స్ఫూర్తితో సౌర విద్యుత్‌కు పెద్దపీట
- పుట్టపర్తిలో 6.3 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి
- కాలుష్య నియంత్రణతో ప్రజలకు ఆరోగ్యం




ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్

# సాయి సన్నిధిలో... సౌర వెలుగులు

పుట్టపర్తి అర్బన్: ఆధ్యాత్మికతను, సేవా భావాన్ని పంచుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న 'సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్' కాలుష్య నియంత్రణలోనూ తనవంతు పాత్ర పోషిస్తోంది. భగవాన్ సత్యసాయిబాబా ఏర్పాటు చేసిన ఈ ట్రస్టు ప్రజలకు ఉచిత వైద్యం, విద్య, తాగునీరు అందించడమే కాకుండా పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగానికి పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా సౌర విద్యుత్‌ను భారీస్థాయిలో ఉత్పత్తి చేస్తోంది. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఇంటింటికీ సౌర విద్యుత్ అందించాలనే లక్ష్యంతో 'ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన' పేరుతో పథకాన్ని అందుబాటులో తీసుకువచ్చింది. అయితే సత్యసాయి ట్రస్ట్ ఆరేళ్ల క్రితమే సౌర విద్యుత్ ఉత్పత్తి, వినియోగంతో ఆదర్శంగా నిలుస్తోంది.

**'గోగ్రీన్' స్ఫూర్తితో...**

ప్రశాంతి నిలయం వేదికగా 2018లో 'గోగ్రీన్' సదస్సు జరిగింది. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా ఉన్న పర్యావరణ వేత్తలు హాజరయ్యారు. అప్పట్లో వీరు ఇచ్చిన సలహాలు, సూచనలకు అనుగుణంగా ట్రస్ట్ భవనాలపై సౌరవిద్యుత్ ప్యానెళ్లను ఏర్పాటు చేసి.. ఉత్పత్తి అయిన విద్యుత్‌ను సొంత అవసరాలకు వినియోగించుకోవాలని నిర్ణయించారు. వెంటనే కొన్ని భవంతులతో పాటు ఖాళీ స్థలాల్లో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి తొలుత రెండు మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. అనంతరం రెండవ విడతలో 2.5 మెగా వాట్లు, మూడో విడతలో 1.8 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అనుగుణంగా సోలార్ ప్యానెళ్లు అమర్చారు. మొత్తం ట్రస్టు భవనాలతో పాటు ఆస్పత్రిలోని ఖాళీ స్థలాల్లోనూ సౌర ఫలకాలను ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తిలో ట్రస్ట్ నిర్వాహకులు ఆదర్శంగా నిలిచారు.


పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని ప్రతి భవనంపై కనిపిస్తున్న సోలార్ ప్యానెళ్లు

**చూడచక్కని ఏర్పాటు..**

పుట్టపర్తిలో సత్యసాయి ట్రస్ట్‌కు సంబంధించిన కళాశాల భవనాలు, క్రీడా ప్రాంగణాలు, సాయికుల్వంత్ మందిరం, భజన మందిరం, సౌత్, ఈస్ట్, వెస్ట్, నార్త్ క్యాంటీన్ భవనాలు, సాధనా ట్రస్ట్, సత్యసాయి సూపర్ స్పెషాలిటీ, జనరల్ ఆస్పత్రి భవనాలు, ఇండోర్ స్టేడియం, సంస్థ కార్యాలయ భవనాలు, రెసిడెన్షియల్ క్వార్టర్స్‌పై సోలార్ ప్యానెళ్లను చూడచక్కగా అమర్చారు. ఈ అందమైన ఆకృతులు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. భవనాలపై సోలార్ ఫలకాలు ఏర్పాటు చేయడంతో భవనాల లోపల కొంత మేర వేడి సైతం తగ్గింది.

**గ్రిడ్‌కు అనుసంధానం..**

సత్యసాయి ట్రస్ట్ ఉత్పత్తి చేస్తున్న సౌర విద్యుత్‌ను స్థానిక అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. దీంతో మిగులు విద్యుత్తుపై యూనిట్‌కు రూ.2.9 చొప్పున విద్యుత్ సంస్థ ట్రస్ట్‌కు చెల్లిస్తోంది. ఈ మొత్తం నేరుగా ట్రస్ట్ బ్యాంకు ఖాతాకు జమ అవుతుండడం గమనార్హం.

**కాలుష్యాన్ని నియంత్రించగలిగాం**



పుట్టపర్తికి విచ్చేస్తున్న దేశవిదేశాల భక్తుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వాతావరణ కాలుష్య నియంత్రణ, గ్రీన్ ఎనర్జీ పెంపుపై దృష్టి సారించాం. సౌర విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటుతో చాలా వరకూ వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించగలిగాం. విద్యుత్ బిల్లులు ఆదా అయ్యాయి. ట్రస్ట్ విస్తరించిన ప్రతి ప్రాంతంలోనూ సౌర ఫలకాల ఏర్పాటుకు చొరవ తీసుకుంటున్నాం. సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తికి వినియోగించే బొగ్గు, నీళ్ల లభ్యత కాలక్రమేణా తగ్గిపోయే ప్రమాదముంది కావున, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. – ఆర్‌జే రత్నాకర్‌రాజు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ

**మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతాం**



సత్యసాయి సెంట్రల్ ట్రస్టు స్ఫూర్తితో సౌర విద్యుత్ ఉత్పత్తిలో పుట్టపర్తిని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతాం. ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేస్తాం. పీఎం సూర్య ఘర్ యోజన పథకంలో భాగంగా సౌర విద్యుత్ ఉత్పత్తికి ఏర్పాటు చేసే పరికరాలు సుమారు 25 ఏళ్ల పాటు మన్నిక వస్తాయి. కావున ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి.

– శివరాం, విద్యుత్ శాఖ డీఈ, పుట్టపర్తి

- వాటర్ ప్లాంట్‌లోకి దూసుకెళ్లిన లారీ

### యువకుడి దుర్మరణం


మృతుడు భాస్కర్

గుత్తి రూరల్: వాటర్ ప్లాంట్‌లోకి లారీ దూసుకెళ్లిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న గుత్తి మండలం యంగన్నపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ (24), లక్ష్మణ్ బుధవారం తొండపాడు గ్రామంలో వాటర్‌ప్లాంట్ పక్కన నూతన గృహ నిర్మాణ పనుల్లో పాలు పంచుకున్నారు. సాయంత్రం పనులు ముగించుకున్న అనంతరం వాటర్ ప్లాంట్ వద్ద నీళ్లు తాగుతున్న భాస్కర్, లక్ష్మణ్‌ను తాడిపత్రి వైపుగా వెళుతున్న లారీ ఢీకొని ప్లాంట్‌లోకి దూసుకెళ్లింది. భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్‌ను స్థానికులు గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, ప్రమాదం చోటు చేసుకున్న వెంటనే లారీ ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. డ్రైవర్, క్లీనర్ కిందకు దూకి అక్కడే ఉన్న నీటితో మంటలు ఆర్పి పారిపోయారు. మద్యం మత్తులో వాహనాన్ని వేగంగా నడిపి ప్రమాదానికి కారణమైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సురేష్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

### ద్విచక్ర వాహనాల ఢీ - ఇద్దరికి తీవ్ర గాయాలు

అనంతపురం: నగరంలోని ఆర్టీఓ కార్యాలయం సమీపంలోని శ్రీచైతన్య స్కూల్ హాస్టల్ బ్రాంచ్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ద్విచక్ర వాహనంపై వెళుతున్న సుమంత్ ఆర్టీఓ కార్యాలయం వద్ద ప్రధాన రహదారిని దాటుతుండగా నగరం వైపు నుంచి ఆర్టీఓ కార్యాలయం వైపుగా ద్విచక్ర వాహనంపై వేగంగా దూసుకెళ్లిన మైనర్ బాలుడు ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన సుమంత్, మైనర్ బాలుడిని అక్కడే ఉన్న ఆటో డ్రైవర్లు వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స సమయంలో సుమంత్‌కు మూర్ఛ రావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు పేర్కొన్నారు.

## రెక్కీ నిర్వహించి.. హతమార్చి

- యువకుడి హత్యకేసులో వీడిన మిస్టరీ
- ఆర్థిక లావాదేవీలతోనే హత్య
- నలుగురి అరెస్ట్

తాడిపత్రి రూరల్: మండలంలోని రావివెంకటాంపల్లి సమీపంలో చోటు చేసుకున్న యువకుడి హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఆర్థిక లావాదేవీల వ్యవహారం కారణంగానే రెక్కీ నిర్వహించి, హతమార్చినట్లు పోలీసులకు పట్టుబడిన నలుగురు నిందితులు అంగీకరించారు. తాడిపత్రి పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను సీఐ శివగంగాధరరెడ్డి వెల్లడించారు.

తాడిపత్రి మండలం రావివెంకటాంపల్లికి చెందిన పెద్దిరాజు, రంగనాయకులు, వెంకటేష్, రవికాంత్ ఐచర్ వాహన డ్రైవర్లుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన వంశీకుమార్... పెద్దిరాజు, రంగనాయకులతో కలసి వాహన క్లీనర్‌గా వెళ్లేవాడు. ఈ క్రమంలో వంశీకుమార్ పనిచేసినందుకు వారు డబ్బు సక్రమంగా చెల్లించేవారు కాదు. దీంతో తరచూ వారి మధ్య గొడవలు చోటు చేసుకునేవి. ఈ విషయంగా పెద్దిరాజుకు ఆయన చిన్నాన్న కొడుకు రవికాంత్, అక్క కొడుకు వెంకటేష్ మద్దతుగా నిలవడంతో రెండు వారాల క్రితం స్థానిక రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద రవికాంత్‌పై తన స్నేహితులతో కలసి వంశీకుమార్ దాడి చేశాడు. దీంతో కక్ష పెంచుకున్న పెద్దిరాజు, రంగనాయకులు, వెంకటేష్, రవికాంత్... వంశీకుమార్‌ను హతమార్చేందుకు పథకం వేశారు. నాలుగు రోజులుగా వంశీకుమార్ కదలికలపై నిఘా ఉంచారు. ఈ నెల 22న జేసీ నారాయణ అగ్రికల్చర్ కళాశాల వద్ద ముళ్లకంపల మధ్య మద్యం తాగుతున్న వంశీకుమార్‌పై కత్తితో పాటు రాళ్లతో దాడి చేసి హతమార్చారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో బుధవారం నిందితులను అరెస్ట్ చేసి కత్తి, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించారు.



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

## 12వ వేతన కమిషన్‌ను నియమించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కె.కులశేఖర్‌రెడ్డి

- ఏపీటీఎఫ్ (1938) నాయకుల డిమాండ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు సంబంధించి 12వ వేతన కమిషన్‌ను వెంటనే నియమించాలని ఏపీటీఎఫ్ (1938) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో జిల్లా సబ్ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసనాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫెడరేషన్ రాష్ట్ర పూర్వ ప్రధానకార్యదర్శి కె.కులశేఖర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫి హాజరై, మాట్లాడారు. ఉపాధ్యాయులకు బకాయి పడిన మొత్తాన్ని వెంటనే చెల్లించాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ, జీఐఎస్ తదితర రుణాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్ ఉత్తర్వులు 72,73,74 ద్వారా జూనియర్ కళాశాలల లెక్చరర్లు, డైట్ లెక్చరర్ల పోస్టులను సీనియర్ పాఠశాల సహాయకులతో, డిప్యూటీ ఈఓ పోస్టులను సీనియర్ హెచ్‌ఎంలతో పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. వంద రోజుల కార్యక్రమానికి హాజరయ్యే 10వ తరగతి విద్యార్థులకు రవాణా సౌకర్యం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. లేదంటే సెలవు దినాల్లో ఈ కార్యక్రమాన్ని రద్దు చేయాలన్నారు. అనంతరం జిల్లా సబ్ కమిటీలో ఖాళీగా ఉన్న కార్యదర్శి పోస్టులో అశోక్‌నాయక్, జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా తిరుపాల్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఫెడరేషన్ జిల్లా అదనపు కార్యదర్శి ఆంజనేయులునాయక్, నాయకులు వెంకటరెడ్డి, సత్యప్రసాద్, వజీర్‌బాషా, సాయినాథ్‌రెడ్డి, తిరుపాల్‌నాయక్, జయరాంనాయక్ పాల్గొన్నారు.

## రైలులో నుంచి కిందపడిన విద్యార్థి

- సత్వరమే స్పందించి కాపాడిన రైల్వే పోలీసులు

బత్తలపల్లి: తిరుపతి నుంచి గుంతకల్లుకు ప్రయాణిస్తున్న రైలు నుంచి ఓ విద్యార్థిని ప్రమాదవశాత్తు కిందపడింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సత్వరమే స్పందించి ఆమెను కాపాడారు. ఆర్పీఎఫ్ సీఐ బోయ కుమార్ తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కరివేముల గ్రామానికి చెందిన బోయ నాగరాజు కుమార్తె బోయ హరిత అన్నమయ్య జిల్లా మదనపల్లి వద్ద ఉన్న కలికిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. క్రిస్మస్ సెలవులు రావడంతో బుధవారం తన సోదరుడు గిరిబాబుతో కలసి స్వగ్రామానికి వెళ్లడానికి గుంతకల్లు ప్యాసింజర్ రైలు ఎక్కారు. వీరు ప్రయాణిస్తున్న రైలు ముదిగుబ్బకు చేరగానే హరిత వాష్‌రూంకు వెళ్లింది. ఎంతసేపటికీ ఆమె రాకపోవడంతో అనుమానం వచ్చిన సోదరుడు రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. ఆమె వద్దనున్న ఫోన్ సిగ్నల్ ఆధారంగా బత్తలపల్లి మండలం చిన్నేకుంటపల్లి–డి.చెర్లోపల్లి గ్రామాల మధ్య రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సెక్షన్‌లోని ఆన్ డ్యూటీ కీమెన్ మస్తాన్‌ను అప్రమత్తం చేయడంతో ఆయన అక్కడికు పరిశీలించారు. సమాచారం అందుకున్న ధర్మవరం రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన హరితను 108 అంబులెన్స్‌లో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు కింద పడిపోయినట్లు ప్రాథమిక విచారణ తేలింది. ప్రస్తుతం ప్రాణాపాయం నుంచి ఆమె బయటపడినట్లు ఆర్డీటీ వైద్యులు తెలిపారు.


డి.చెర్లోపల్లి–చిన్నేకుంటపల్లి గ్రామాల మధ్య రైలు పట్టాల పక్కన పడిన హరిత

## ఆటోను ఢీ కొన్న మరో ఆటో

- ఏడుగురికి గాయాలు

బత్తలపల్లి: రోడ్డుపై బోల్తాపడిన ఆటోను మరో ఆటో ఢీకొన్న ఘటనలో ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిమర్రి మండలం నిడిగల్లులో ఉన్న చర్చి నిర్వాహకులు క్రిస్మస్ పండుగ సందర్భంగా చికెన్ తీసుకువచ్చేందుకు ఆటోలో బుధవారం ఉదయం ధర్మవరానికి బయలుదేరారు. బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకోగానే ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన పల్లంలోకి వెళ్లింది. దీంతో ఆటోను తిరిగి రోడ్డుపైకి ఎక్కించే ప్రయత్నంలో రాయిని ఢీ కొనడంతో బోల్తా పడింది. అదే సమయంలో ముదిగుబ్బ మండలం వలిమిచెర్లోపల్లిలో సమీప బంధువు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు కనగానపల్లి మండలం మామిళ్లపల్లికి చెందిన కొత్తపల్లి బాలరాజు తన భార్యతో కలసి వెళుతున్న ఆటో ఢీకొంది. రెప్పపాటులో జరిగిన ఈ ప్రమాదంలో నిడిగల్లు ఆటో డ్రైవర్ బీదల సంతోష్, చిన్నగాని తొలంద్ర బాబు, నరేంద్ర, మామిళ్లపల్లి ఆటో డ్రైవర్ కొత్తపల్లి బాలరాజు, ఆయన భార్య శ్రావణితో పాటు బత్తలపల్లి వరకూ ఆటోలో ప్రయాణిస్తున్న దుగ్గెన్న (ధర్మవరం పట్టణం బోయవీధి), ఆర్డీటీ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో పని చేస్తున్న యమున (ధర్మవరం మండలం నాగలూరు గ్రామం) గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ప్రైవేట్ అంబులెన్స్ ద్వారా ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం దుగ్గెన్నను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి వైద్యులు రెఫర్ చేశారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

## ప్రశాంతి నిలయంలో ఘనంగా క్రిస్మస్

ప్రశాంతి నిలయం: క్రిస్మస్ పర్వదిన వేడుకలు ప్రశాంతి నిలయంలో బుధవారం ఘనంగా జరిగాయి. దేశవిదేశాలకు చెందిన వేలాది భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. సాయికుల్వంత్ సభా మందిరాన్ని క్రిస్మస్ సంప్రదాయ పద్ధతుల్లో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు క్రిస్మస్ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులకు క్రిస్మస్ బహుమతులు అందజేశారు. క్రిస్మస్ విశిష్టతను చాటుతూ క్యారల్స్ ఆలపించారు. విదేశీ సత్యసాయి భక్తులు ప్రత్యేకంగా తయారు చేసిన క్రిస్మస్ కేక్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు, సత్యసాయి సేవా సంస్థల గ్లోబల్ కౌన్సిల్ అధ్యక్షుడు చక్రవర్తి కట్ చేసి భక్తులకు పంపిణీ చేశారు.


క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఆర్‌జే రత్నాకర్‌రాజు, చక్రవర్తి


క్యారల్స్ ఆలపిస్తున్న ప్రశాంతి భజన బృందం


శాంతాక్లాజ్ వేషధారణతో సందడి చేస్తున్న భక్తుడు

## క్లుప్తంగా

### 'మట్టి మట్టి' పుస్తక పరిచయ సభ రేపు

**అనంతపురం కల్చరల్:** స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రైతు కవి దర్భశయనం శ్రీనివాసాచార్య వెలువరించిన 'మట్టి మట్టి' వ్యవసాయ కవిత్వ సంపుటి పుస్తక పరిచయ సభ శుక్రవారం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు చంద్రశేఖర శాస్త్రి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ కళాశాలలో జరిగే కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, బండి నారాయణస్వామి తదితరులు పుస్తకాన్ని విశ్లేషిస్తారని పేర్కొన్నారు. సాహిత్య అభిమానులు విచ్చేయాలని కోరారు.

### 'అయోడిన్'తోనే ఆరోగ్యం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

**రాప్తాడురూరల్:** సంపూర్ణ ఆరోగ్యం కావాలంటే శరీరానికి అయోడిన్ చాలా ముఖ్యమని, అయోడిన్ లోపం కలగకుండా జాగ్రత్త పడాలని కళాకారులు ప్రజలను జాగృతం చేశారు. అయోడిన్ లోపం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం అనంతపురం రూరల్ మండలం కొడిమి, రాచానపల్లి, తాటిచెర్ల పంచాయతీల్లో కళాకారుడు తరిమెల రాజు నేతృత్వంలో కళాజాతా బృందాలు అవగాహన కల్పించాయి. స్మార్ట్ ఆశీర్వాద్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఐటీసీ సహకారంతో జిల్లాలోని 40 గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఐజీడీ జిల్లా కోఆర్డినేటర్ దురగయ్య తెలిపారు.

### నేడు సఫల ఏకాదశి వేడుకలు

**అనంతపురం కల్చరల్:** భావసారక్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో నగరంలోని రామనగర్‌లో వెలసిన రుక్మిణి పాండురంగ విఠల స్వామి ఆలయంలో గురువారం 'సఫల ఏకాదశి' వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. మార్గశిరంలో వచ్చే పవిత్ర ఏకాదశి పర్వదినాన్ని భావసార క్షత్రియులు అత్యంత పవిత్రంగా భావిస్తారన్నారు. ఉదయం 6.30 గంటల నుంచి వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. 8 గంటలకు రుక్మిణి పాండురంగస్వామి నిజపాద దర్శనం, అభిషేకాలు, అర్చనలు జరుగుతాయని, భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

### సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి



ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను కలిసి వినతి పత్రం ఇస్తున్న ఎల్‌ఐసీ ఏజెంట్లు

**అనంతపురం అగ్రికల్చర్:** లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసీ)లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ నాయకులు కోరారు.బుధవారం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణను ఆయన నివాసంలో కలిశారు. ఎల్‌ఐసీ కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి కదిరెప్ప ఆధ్వర్యంలో బ్రాంచి-2 నాయకులు వీవీ రమణారెడ్డి, ఆదిశేషయ్య, చెరకుతోట జగదీష్, మల్లికార్జున, అంజినప్ప, త్రివిక్రమ్ తదితరులు వినతి పత్రం ఇచ్చారు. పాలసీదారులపై జీఎస్టీ తొలగించాలని, పాలసీలపై బోనస్ పెంచాలని తదితర డిమాండ్ల పరిష్కారానికి పార్లమెంట్ సమావేశాల్లో చర్చకు వచ్చేలా చూడాలని కోరారు.

### 'మనుధర్మ శాస్త్రం నశించాలి'



మనుస్మృతికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

**అనంతపురం టవర్‌క్లాక్:** మనుధర్మ శాస్త్రం నశించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ కొడవండ్ల అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ అంబేడ్కర్ 1927 డిసెంబర్ 25న మనుస్మృతిని దహనం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, చంద్రచర్ల హరి, రాము, చందునాయక్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



అరవిందనగర్ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ రాజశేఖర్



బైబిల్ చదువుతున్న మహిళలు



సప్తగిరి సర్కిల్ ఎస్‌యూసీఐ చర్చిలో మహిళల గీతాలాపన



ఏసు కృపా మందిరంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

# మార్మోగిన క్రీస్తునామం



● భక్తులతో పోటెత్తిన ప్రార్థనా మందిరాలు



ఆకట్టుకుంటున్న క్రిస్మస్ ట్రీ



ఎస్‌యూసీఐ చర్చిలో కోలాహలం



ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

**అనంతపురం కల్చరల్:** అపరాధులను, పాపులను పరిశుద్ధాత్ములుగా మార్చిన దైవ కుమారుని రాకతో బుధవారం క్రీస్తు నామస్మరణ మార్మోగింది. నగరంలోని ప్రార్థనా మందిరాలు, చర్చిలు అసంఖ్యాకంగా తరలివచ్చిన క్రైస్తవ భక్తుల కిటకిటలాడాయి. శోభాయమానంగా అలంకరించిన ఏసు క్రీస్తు పవిత్ర సిలువ వద్ద సామూహిక ప్రార్థనలను నిర్వహించారు. ప్రతి చర్చిలో కోయర్ బృందాల సాంస్కృతిక కార్యక్రమాలు, శాంతాక్లాజ్ వేషధారణలు ఆకట్టుకున్నాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే ప్రారంభమైన క్రిస్మస్ సంబరాలు అర్ధరాత్రి దాకా అంబరాన్నంటేలా సాగాయి. స్థానిక సప్తగిరి సర్కిల్ వద్దనున్న ఎస్‌యూసీఐ చర్చిలో ఘనంగా జరిగిన క్రిస్మస్ ప్రార్థనలలో సంఘకాపరి సంపత్ విజయ్‌కుమార్ క్రిస్మస్ దివ్య సందేశాన్ని వినిపించారు. కొత్త శకాన్ని ప్రారంభించిన క్రీస్తు శుభ జన్మదినాన ప్రజలందరూ పరస్పరం శాంతి సౌభాగ్యాలతో జీవిస్తూ లౌకిక వాదాన్ని పరిరక్షించాలని ఆకాంక్షించారు. శాంతి స్వరూపుడైన దైవకుమారుని స్తోత్రంతో పునీతులవుదామన్నారు.

● అరవిందనగర్‌లోని వందల ఏళ్ల నాటి సీఎస్ఐ చర్చిలో క్రీస్తు జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. వేలాది మంది భక్తులు ఏసయ్య జన్మ విశేషాలతో కూడిన శుభ సందేశంతో పునీతులయ్యారు. రెవరెండ్ బెన్హర్‌బాబు అధ్యక్షతన ముఖ్య అతిథిగా హైదరాబాదు నుంచి విచ్చేసిన రెవరెండ్ రాజశేఖర్ వాక్యోపదేశంలో సాక్షాత్తు భగవంతుడు నడయాడిన భువిపై మనం జీవిస్తుండడం మనందరి అదృష్టమన్నారు. ఏసు మళ్లీ రెండవ జన్మ ధరిస్తాడని విశ్వాసం వ్యక్తం చేశారు. కమిటీ నిర్వాహకులు సెక్రటరీ జాన్ సుధీర్, జడ్‌దేవ రాజ్, సునీల్‌కుమార్, చంద్ర శేఖర్ తదితరులున్నారు.

● జీసెస్ నగర్‌లోని హెర్మోన్ చర్చిలో ఫాదర్ ఐజయ్య క్రీస్తు సువార్తను వినిపించారు. రామచంద్రానగర్‌లోని కార్మియల్‌మాత మందిరంలో, స్థానిక కోర్టు రోడ్డులో ఉన్న గాస్పెల్ హాల్‌లో క్రిస్మస్ వేడుకలు నయనానందకరంగా నిర్వహించారు. కళాకారులకాలనీలోని రేమా చర్చిలో రెవరెండ్ మనుష్యే వాక్యోపదేశం చేశారు. క్రీస్తు విశ్వాసుల సంఘంలో పాస్టర్ నతానియల్ బైబిల్ వాక్యం చెపుతూ క్రిస్మస్ శుభ సందేశ ప్రాముఖ్యత, క్రీస్తు రాకడ గురించి వివరించారు. దైవ కుమారుని స్తోత్రంతో కోయర్ బృందాలు ఆలపించిన ప్రార్థనా భక్తి గీతాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

#### జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో..

**అనంతపురం:** జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్ చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా అడిషనల్ ఎస్పీ ఇలియాజ్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏఆర్ ఏఎస్పీ మాట్లాడుతూ.. ఏసు క్రీస్తు ప్రేమకు ప్రతిరూపమన్నారు. ఆయన ప్రేమతో ప్రపంచాన్ని జయించాడన్నారు. ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, చర్చి ఫాదర్ వినోద్ కుమార్, ఆర్ఐలు రాముడు, బాబు, పోలీసు అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు జాఫర్, అడహాక్ కమిటీ సభ్యులు గాండ్ల హరినాథ్, తేజ్ పాల్, శ్రీనివాసులు నాయుడు, నాగరాజు, మసూద్ వలీ పాల్గొన్నారు.



పోలీసు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న అడిషనల్ ఎస్పీ ఇలియాజ్ బాషా

#### రక్షించడానికే లోకానికి వచ్చిన ఏసుక్రీస్తు

**రాప్తాడురూరల్:** ప్రజలను పాపాల నుంచి రక్షించడానికే ఏసుక్రీస్తు లోకానికి వచ్చాడని బెంగళూరుకు చెందిన ఎబినేజర్ బైబిల్ కళాశాల ఫౌండర్ ఎస్కే జార్జ్ అన్నారు. బుధవారం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సమీపంలోని ఏసుకృపా మందిరంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు.ఏసుకృపా మందిరం వ్యవస్థాపకులు రెడ్డివారి నెహమ్యా నాగరాజు అధ్యక్షతన జరిగిన వేడుకలకు ఎస్కే జార్జ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. పేదవారికి సాయం చేయాలని, పొరుగువారిని ప్రేమించాలని ఏసుక్రీస్తు సూచించారన్నారు. చీకటిలో ఉన్నవారిని వెలుగులోకి నడిపించడానికి దేవుడు ఏసుక్రీస్తు ప్రభువును ఈ లోకానికి పంపాడని రెడ్డివారి నెహమ్యా నాగరాజు అన్నారు. అనంతరం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జి.నవీన్‌కుమార్, పాస్టర్ జాషువా జహంగీర్, పాస్టర్ రూఫస్ కుమార్, మందిర సంఘం సభ్యులు సిస్టర్ లీనా దేబోరా పాల్గొన్నారు.

### ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**రాప్తాడు:** హింస, స్వార్థం పెరిగిపోతున్న నేటి సమాజంలో శాంతి, కరుణ విస్తరించాలని, అందుకు యేసు చూపిన మార్గాలను అనుసరించాలని రాప్తాడులోని కరుణమయుడు పుణ్యక్షేత్రం చర్చి, చిన్మయనగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ చర్చి విచారణ గురువులు ఫాదర్ బాలరాజు, రవీంద్రా ప్రసాద్ పేర్కొన్నారు. క్రిస్మస్ సందర్భంగా బుధవారం ఆయా చర్చిలలో వారు వాక్యోపదేశం చేశారు. అలాగే మండల వ్యాప్తంగా క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చర్చిలలో క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ప్రార్థనల్లో ఫాదర్ గుణశేఖర్, బోంతు ప్రసాద్, ఫాదర్ బాలశౌరి తదితరులు పాల్గొన్నారు. రాప్తాడులోని కరుణమయుడు చర్చి, చిన్మయనగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ చర్చిలలో జరిగిన ప్రార్థనల్లో రాజకీయ నాయకులు పాల్గొన్నారు. ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, మండల కన్వీనర్ జూటూర్ శేఖర్, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, నాయకులు భూమిరెడ్డి మహానంది రెడ్డి, చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, బీసీ సెల్ నాయకులు చిత్రా వెంకటేష్, పసుపుల ఆది, కాంట్రాక్టర్ చంద్ర తదితరులు పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

**ఆత్మకూరులో...**

**ఆత్మకూరు:** మండల వ్యాప్తంగా బుధవారం అన్ని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పి, యాలేరు గ్రామంలో జరిగిన ప్రార్థనల్లో క్రైస్తవులు భారీగా పాల్గొన్నారు. క్రీస్తు పుట్టుకను వివరిస్తూ చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన పశువుల పాక ఆకట్టుకుంది. అలాగే ఆత్మకూరు, సనప, తలుపూరు, పంపనూరు గ్రామాల్లోనూ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



క్రిస్మస్ ట్రీ వద్ద బాలికల సెల్ఫీ



పి. యాలేరులో కొవ్వొత్తులు వెలిగిస్తున్న దృశ్యం



రాప్తాడు: చిన్మయనగర్ ఎస్ఎఫ్ఎస్ చర్చిలో సందేశమిస్తున్న రవీంద్ర ప్రసాద్



అనంతపురం ఎస్‌యూసీఐ చర్చిలో చంటిబిడ్డతో ప్రార్థనలు చేస్తున్న మహిళ



ఆత్మకూరు: యేసుప్రభువు జీవన విధానాన్ని తెలియజేస్తున్న దృశ్యం

## కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం



మాట్లాడుతున్న మేయర్ వసీం, చిత్రంలో డిప్యూటీ మేయర్ వాసంతి తదితరులు

**అనంతపురం కార్పొరేషన్:** ప్రజల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని మేయర్ వసీం అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, అనుబంధ సంఘాల అధ్యక్షులు మల్లెమీద నరసింహులు, సైపుల్లాబేగ్, కార్పొరేటర్లతో కలసి ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరు నెలలు గడుస్తున్నా చేసిందేమీ లేదని విమర్శించారు. పైగా విద్యుత్ చార్జీలను పెంచుతూ ప్రజలను ఆర్థికంగా దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రూ.15,485 కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపడం శోచనీయమన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశానుసారం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామి రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 27న ఉదయం 10 గంటలకు నగరంలోని పాతూరు బ్రహ్మంగారి గుడి నుంచి విద్యుత్ కార్యాలయం వరకు జరిగే పోరుబాట ర్యాలీకి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలపై ఎటువంటి భారాలూ మోపలేదన్నారు. అయినా టీడీపీ దుష్ప్రచారం చేసిందన్నారు. మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తోందన్నారు. ఎన్నికల్లో అలివిగాని హామీలతో గద్దెనెక్కి నేడు ఒక్క హామీ నెరవేర్చడం లేదన్నారు. ప్రజలపై అదనపు భారం మోపడం సరికాదన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు రాజేశ్వరి, రహంతుల్లా, అలీషేక్ ఇసాక్, రమణ, శ్రీనివాసులు, నాయకులు చింతకుంట మధు, రఫి, దాదు, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, రవి, అన్సర్, పాల్గొన్నారు.

#### 'పోరుబాట' జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కాగజ్‌ఘర్ రిజ్వాన్

**అనంతపురం కార్పొరేషన్:** ఈ నెల 27న నగరంలో చేపట్టిన పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలు ఆర్థికంగా బలపడేందుకు పథకాలు ప్రవేశపెడితే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అదనపు భారాలు మోపుతోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలు, నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలపై రూ.15,485 కోట్ల భారం మోపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

## ఔత్సాహికులకు కంటెంట్ క్రియేటర్స్ అవార్డు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

**అనంతపురం కల్చరల్:** క్రియేటివ్ కంటెంట్‌తో జిల్లా ఖ్యాతిని చాటుతున్న ఔత్సాహిక కళాకారులకు అవార్డులు అందిస్తున్నామని పారిశ్రామికవేత్త ముదార్ సుధీర్ అన్నారు. ఈ మేరకు ముదార్ డిజీ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఈనెల 29న జరగనున్న అవార్డుల ప్రదానోత్సవం పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. లక్ష్మీనగర్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో నిర్వాహకుడు ముదార్ సుధీర్, సీనియర్ న్యాయవాది నామసేవ హరికృష్ణ, అనంత జిరసం అధ్యక్షుడు సాకే శ్రీహరిమూర్తి, ప్రముఖ కెమెరామెన్ పవన్ లింగాల, యువ అనలిస్టు ప్రణవ్ ముదార్ ఆత్మీయ అతిథులుగా మాట్లాడారు. జిల్లాకు చెందిన ముదార్ సుధీర్ 'ఫ్రాక్సో' మొబైల్ యాప్‌ను ప్రవేశపెడుతున్నారన్నారు. ఆదివారం వాటి వివరాలతో లాంచ్ చేస్తామన్నారు. క్రియేటివ్ ఆలోచనలతో జనాదరణ పొందుతున్న వారికి స్థానిక వివాహ భోజనంబు ఫంక్షన్ హాలులో అవార్డులనందిస్తున్నామని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రియేటర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9989201612 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### నేడు ఎం.చెర్లోపల్లిలో రెవెన్యూ సదస్సు

**రాప్తాడు:** భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ నెల 26వ తేదీ (గురువారం) మండలంలోని ఎం.చెర్లోపల్లిలో రెవెన్యూ సదస్సును నిర్వహిస్తున్నామని తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. గ్రామంలో జరిగే సదస్సుకు మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఎం.చెర్లోపల్లి రెవెన్యూ గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

### ముగ్గుల పోటీలకు పేర్లు నమోదు చేసుకోండి

**రాప్తాడు:** మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయనగర్‌లోని గౌరి ప్రసన్నేశ్వర స్వామి ఆలయం దగ్గర సంక్రాంతి పండుగ (జనవరి 14) రోజు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఆసక్తి కలిగిన వారు పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజుల తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు రెనాటి కొండా రెడ్డి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి మహనంది రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 14వ తేదీ సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు ముగ్గుల పోటీ ఉంటుందన్నారు. తొలి మూడు స్థానంలో నిలిచిన వారికి బహుమతులు ఉంటాయన్నారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు.

### ఎస్కేయూ క్యాంపస్‌లో చెట్లకు నిప్పు



మంటలు ఎగిసిపడుతున్న దృశ్యం

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని మైదాన ప్రాంతంలో దుండగులు నిప్పు పెట్టారు. దీంతో నిప్పురవ్వలు దావానంలా వ్యాపించి పలు చెట్లు దగ్ధమయ్యాయి. ఎలాంటి స్థిరాస్తి నష్టమూ జరగలేదు. అదృష్టవశాత్తు సోలార్ ప్యానళ్లు సురక్షితంగా ఉన్నాయి. ఫైర్ ఇంజిన్ రావడానికి వీలు కాకపోవడంతో ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు సిబ్బందితో కలిసి మంటలను ఆర్పివేశారు.